# ముగింపు మార్చకండి

ఎ.వి. శేషారత్నం



ఠాణాలో నాలుగ్గంటలు కొట్టారు. నాలో విచిత్రమైన వణుకు ప్రారంభమయింది. నాకిది కొత్త కాదు. కానీ ఈరోజు ఒక స్త్రీని..

భగవాన్! ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నానో ఈ జన్మలో ఇలాంటి నరకం. నన్ను చూసేవారి కళ్లల్లో భరించరాని ఏవగింపు, నిరాశ, ఆవేదన, వైరాగ్యం— వాటిని భరించే శక్తి నాకు లేకపోయినా తప్పడంలేదు. అశక్తురాలిని. అలాంటప్పుడు నా తలకాయను దేనికైనా వేసి బాదుకోవాలనిపిస్తుంది.

కానీ అలాంటప్పుడే మరో తలకాయను నా తలకు వేలాడదీసి ఉరితీస్తారు.

ఉరితీసేటప్పుడు ఆ ప్రాణి పడుతున్న బాధకు, ఆ ముఖం వికృతంగా మారుతున్నప్పుడూ, నా నరాలు పిండేసినట్టు, ప్రాణం తోడేస్తున్నట్టు ఉంటుంది నాకు. ఇంకా ఎన్నాళ్లో నాకీ శిక్ష?

ఉరి బిగించేటప్పుడు తలారి 'తనకేం పాపం అంటదు' అంటూ ఉరితీస్తాడు- ఆ పాపం నా కంటాలనో ఏమో! కాళ్ల క్రింద పలక తొలగి బరువు క్రిందకి లాగేస్తుంటే, నా కంఠం తాడు పైకి లాగుతుంటే ఆ ప్రాణి ఉసురు.. ప్రాణంపోయిననాటి రాత్రంతా ఆ ప్రాణి ఆత్మ నన్ను శాపనార్థాలు పెడుతూ నా చుట్టూ తిరుగుతూంటే ఒంటరిగా నేను భయంతో బిగుసుకుపోతుంటాను.

సాక్ష్యంలేక కేసు నిలవక శిక్షపడిన ఎందరో అభాగ్యులను ఉరితీసాను. ఆ పాపమే ఇలా క్షోభగా నిరంతరం నాపై పగదీర్చుకుంటోందేమో! ఏ రోజు ఎవరిని ఉరిదియ్యాలో అని నా గుండెలు కొట్టుకుంటూనే ఉంటాయి భయంతో.

మళ్ళీ ఈ రోజు....

పడివయసైనా దాటలేదట పాపం ఆ అభాగినికి. భర్త, పిల్లల ప్రాణాలు తీసిందట విషంపెట్టి. ఆ 'వ్యక్తి' ఎంత ఉన్మాదంలో వుంటుందో!

ఏమిటో కలికాలం! సొంత ప్రాణాలు తీయడానికి చేతు లెలా వచ్చాయో మహాతల్లికి.

కరుణ, జాలి, పాపభీతి నశించిపోయాయి ప్రజల్లో.

అంత ఘోరంగా హత్యలు చేసినా ఈ మనుషుల మొహాలెంత అమాయకంగా ఉంటాయి. ఏదో బలహీన క్షణంలో ఏదో పైశాచికశక్తి వాళ్ల నావహిస్తుందో ఏమో!

ఎన్నెన్ని చిత్రమైన కేసులు. ముక్కుపచ్చలారని యువకులు, ప్రాణం తీసారంటే మొఖమ్లో నమ్మబుద్ధేసేదే కాదు.

దేశ క్షేమంకోసం ఉరిదీస్తున్నాం అనేవారు అధికారులు. దేశ క్షేమంకోసం ప్రాణాలుతీసాం అనేవారా యువకులు. వాళ్ల ముఖంలో చావంటే ఏ కోశానా భయం ఉండేది కాదు.

నవ్వుతూ నా చెంత చేరుతుంటే నాకే భయంవేసేది. అన్యాయం చేస్తున్నానేమోననిపించేది.

అప్పుడే పైమయిపోయిందా?

అయ్యో! అదిగో ఆమె! ఇంత చిన్న వయసులోనే మృత్యు కౌగిలిలోకి వస్తోందా?

ఆ ముఖంలో ఏమిటా ప్రశాంతత? చావంటే భయం వెయ్యడంలేదా? నాలుగు ప్రాణాలు తీసిన ఆమెలో హృదయం చచ్చిపోయిందేమో!

ఎందుకమ్మా నిష్కారణంగా అన్ని ప్రాణాలు తీసి నాకు బలయిపోతున్నావు. నిన్ను చూస్తే హంతకురాలిలా అనిపించడంలేదే! ఏదో వెలుగు, వర్చస్సు!

హృదయమా! ఆగు! తీవ్రంగా స్పందించకు. అదిగో ఆ జైలు అధికారి ఏదో అడుగుతున్నా డామెని.

"నీ చివరి కోరిక ఏంటో చెప్పు."

ఆమె నవ్వుతోంది. ఆ కంఠస్వరం వినాలి.

"మాళవ్యగారిని చూడాలి."

ఎవరా మాళవ్య? ఆమె భర్త కాదే? స్నేహితుడేమో! పూర్వాశ్రమంలో ప్రియుడా?

అతనికోసమే ఈ హత్యలు చెయ్య లేదు కదా!

భగవాన్! ఈ ఆడవాళ్లెంతకు తెగి స్తారు?

ఆఫీసరు హుకుంతో సెంట్రీలు పరి గెట్టారు. అడ్రసు చెప్పినట్టుంది ఆమె.

ఒకోసారి చచ్చే ఆశ్చర్యం వేస్తుంది నాకు. ఏంటో? ఈ ఉరిశిక్షపడినవాళ్ళకి ఆఖరి కోరిక తీర్చాలిట– శిక్ష తప్పించు కోవడం తప్ప.

అధికారు లడుగుతూంటే– యమ ధర్మరాజు సతీసావిత్రిని వరములు కోరు కోమన్నట్లుంటుంది. ప్రతిదానికీ 'నీ పతి ప్రాణాలు తప్ప' అంటాడు తెలివిగా యముడు.

ఈ యముళ్లు– ఈ జైలు అధికా రులు కూడ ఒక్కసారైనా ఆ మాట మర్చిపోతారేమోనని ఎదురుచూస్తాను. ఊహూఁ! ఎంత జాగ్రత్త!

ఈ చచ్చిపోబోయేవాళ్ల కోర్కెలు కూడ ఎంత విచిత్రంగా ఉంటాయో! చనిపోబోతూ కూడ ఎంత కాపీనమో! కొందరికి.

'నా ప్రియురాలిని ముద్దుపెట్టుకుం టాను', 'మా అమ్మను కౌగలించుకుం టాను.'

అలాంటప్పుడు నిజంగా నా కేడు పొస్తుంది. కొడుకుని, కొడుకు - స్పర్శని ఆఖరిసారి అనుభవిస్తున్న ఆ తల్లి ఆవేదన, నిస్సహాయత చూడలేక.

"జిలేబి తినాలి."

ఆ తిన్నవస్తువు జీర్ణకోశం చేరకుం డానే తలకాయ ఎగిరిపోతుందని తెలిసినా గొంతు దాటితే చాలనుకుంటారో ఏమిటో.

చెమటతో తడిసి ముద్దయిపోతూ ఏడుపు తప్ప ఏమీ అడగరు కొందరు ప్రాణభీతి వాళ్ల కళ్లలో.

'నా దేశానికి విముక్తి లభించాలి.'

'దేశమాత దాస్య శృంఖలాలు ఛేదిం చాలి.'

నా చిన్నప్పుడు కొత్తలో వినిపించే ఆ మాటలకు నా దేహం కంపించేది. వాళ్ళను త్వరగా నా కౌగిలి చేర్చుకోవా లనిపించేది.

ఇటీవల ఇలాంటివి కరువయాయి. సాధ్యమైనంత నిర్లిప్తంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. అయినా గుండెలు పిండే బాధ.

'ఎవరతను? మాళవ్యా! ఇంత చిన్న వాడా? ఈమెకు తమ్ముడి వయసుకంటె

తక్కువే! ప్రియుడు కాదు-కాబోడదు-'
ఆమె చేతులెత్తి నమస్కరిస్తూ ఏదో అంటోంది. అతని ముఖంలో భరించ లేనంత ఆశ్చర్యం!
అయోమయం!
అత నీమెకు పరిచయం లేదేమో! ఎక్కడైనా ఇలా ఉంటుందా?
ముక్కూ మొహం తెలియనివాళ్ళని చూవాలని కోరుకుంటారా ఎవరైనా?
అది మాత్రం ఖచ్చితంగా చెప్ప గలను— అతనికి ఈమెకు పరిచయమే లేదు.
మరామె మాటలు అంత ఆత్మీయంగా ఉన్నాయే!
'మాళవ్యగారూ! నేను మీకు తెలి యకపోయినా మీరు నాకు బాగా తెలుసు.'
ఒక్కసారి ఈ జన్మకి చివరిసారి మీతో మాట్లాడి మిమ్మల్ని క్షమాపణ కోరితే చాలనిపించింది. అందుకే ఆఖరి కోరిక .. లేదా నాకు విముక్తి ఉండదు.
నేను చేసింది పాపమేమో నాకు తెలి యదు. కాని గత్యంతరంలేని పరిస్థి తుల్లో చేసాను.
మీరు గొప్ప రచయిత. నా కథ వింటే నన్నర్థంచేసుకుని క్షమించగల రనుకుంటాను.
మీరు రచయితగానే నాకు తెలుసు మాళవ్యగారూ! ఇప్పటికి నే నెవరో మీకు తెలిసిపోయివుంటుంది.' ఉద్వే గంతో ఆగింది ఆమె.

అతని ముఖంలో క్షణంలో నీలి నీడలు పరచుకున్నాయి. 'అవును! తన రచనలు. కాని ఈమె ఉరికంబం ఎందు కెక్కుతోంది. భగవాన్! నేను కారణం కాదు కదా! అసలు తన రచనలు.... ఇంత ఘోరం జరుగుతుందని తెలియదే తనకు.'
అత ను పైకి మాట్లాడకపోయినా అతని హృదయం చెబుతున్న మాటలు, భావాలు నాకు తెలుస్తున్నాయి.
'ఆ రోజు....
చిందులు తొక్కాడతను. ఆ పత్రి కలో—
'ఈ కథ మారదా?'— అంతా తన రచన. కాని ఇదేమిటి పేరు; మృణాళ్. ఇదెలా సాధ్యం?
ఎంత రచయితల భావాలు కలిస్తే మాత్రం మొదట్నుంచీ చివరివరకూ రెండు రచనలు ఒకేలా ఉండడం సాధ్యమా?
కథ రెండుసార్లు ఆ కొసనుండి ఈ కొసవరకు చదివాడు. ముగింపు తప్ప అంతా తనదే.
అప్పుడు గుర్తుకొచ్చింది. ఆ పత్రి కాఫీసునుండి తనకేం ఇంటిమేషన్ రాలేదని. అయినా అదేం పట్టించుకోలేదు.
కొన్ని పత్రికలవాళ్ల రెమ్యూనరే షన్ పంపినప్పుడు తప్ప కథ పడిందని తెలియనే తెలియదు. తనకి చాలసార్లు అనుభవం కూడ.



పేరు పొరపాటున తప్పు అచ్చయిందేమో! అయితే రెమ్యూనరేషన్ ఎన్నాళ్ళకీ రాకపోయేసరికి తన అనుమానం బలపడింది.

అశనిపాతంలా తనదే మరో రచన మరో మేగజైన్‌లో— కానీ తన పేరుతో కాదు.

తనకి బాగా గుర్తు. ఒక్కసారే నాలుగు కథలు పోస్ట్ చేసాడు.

గబగబా ఆ నెల సంచికలు అన్నీ కొన్నాడు. కానీ తన రచనలు రాలేదు.

కానీ పోటీకి పంపిన కథ ద.... రచయిత అజ్ఞాతంగా ఉండదల్చుకున్నారని తప్ప మరే వివరాలు ప్రకటించలేదు ఆ పత్రిక.

ఛీ ఇంత నీచమా? నిలువెల్లా అసహ్యంతో కోపంతో దహించుకుపోయింది తనకి.

ఎవరో తెలివైనవాళ్ళు తను పోస్ట్ చేసేటప్పుడు గమనించి.... లంచం పెట్టి తన రచనలు కాజేసి.... అన్నిటికీ ముగింపులు మారిపోయి వున్నాయి. ఆ

ముగింపులు బాగున్నా కళ్ళ వెంటనీరు తిరిగింది తనకి.

తన కష్టార్జితం....

ఎవరింత నీచానికి పాల్పడింది?

తనలో కసి....

మళ్లీ రెండు కథలు పోస్ట్ చేసాడు.

ఆశ్చర్యం!

కొన్నాళ్ళకి మరో పేరుతో అచ్చయ్యాయి అవి. ఇంట్లోనే ఎవరైనా తనని ఏడ్పించడానికి చేస్తున్నారా అంటే తన భార్యకి అక్షరంముక్క రాదు. పైగా తన రచనలమీద సదభిప్రాయం లేదు. నిజానికి అంతకంటె ఘోరం శాపం ఉండదేమో రచయితకి.

పగలల్లా సాధింపులతో, పిల్లల గోలతో అసలు వ్రాయడమే మానేసాడు. కానీ స్నేహితుడు —చిన్ననాటి ప్రాణ స్నేహితుడు విశ్వం ప్రోద్బలంతో మళ్లీ మొదలుపెట్టాడు.

కానీ ఇదేంటి? ఇదెక్కడి అన్యాయం అసలెవరు కాజేస్తున్నారు తన రచనలు?

అయా పత్రికాఫీసులకి వ్రాసినా లాభం లేకపోయింది. చివరికి ఒకే ఒక ఉపాయం—

అది తప్పు అని తెలిసినా, విధి వక్రించి తనకే బెడిసికొడితే అనే అనుమానం వచ్చినా... తెగించి ప్రయోగించాడు.

మళ్లీ నాలుగు కథలు ఒకేసారి అచ్చయ్యాయి. కానీ పాఠకులనుంచి వచ్చిన ఉత్తరాల ధాటికి ఆ పత్రికాధిపతులు ఆగలేకపోయారు.

"ఈ కథ కాపీ అని మాకు ఏ మాత్రం తెలియదు. రచయితకు ఈ ఉత్తరాలు పంపించి సంజాయిషీ కోరుతున్నాం. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి క్షంతవ్యులం."

నాలుగు పత్రికలలోను ఈ ప్రకటనలు వచ్చేసరికి, రచయిత సంజాయిషీ కోసం ఎదురుచూసాడు తను.

కానీ ఎందువల్లనో అది ప్రకటింపబడనేలేదు. తరువాత చాల విచిత్రంగా తను పంపిన కథలు తిరిగొచ్చాయి. కాని ప్రచురింపబడలేదు. ఆతృతగా విప్పి చూసాడు ముగింపు ఎవరైనా మార్చారేమో ఆ చేతివ్రాత చూద్దామని. కానీ తన కోరిక తీరనేలేదు.

తరువాత తనా విషయం మరిచేపోయాడు. తరువాత తనవి ఏవో ఒకటి రెండు కథలు అచ్చయాయి అంతే.

అయితే ఈమె?

ఆ రచనల దొంగ?

కానీ చూస్తుంటే చాల సంస్కారవంతురాలిలా వుందే? ఈమె చేసిన నేరమేమిటి? ఎందుకు ఉరి తీస్తున్నారు?

ఉదయమే తనని ఎవరో చూడాలనుకుంటున్నారని ఇక్కడకు తీసుకొస్తే మతిపోయింది తనకి.

"మాళవ్యగారూ! గుర్తించారా నన్ను.

నేను దొంగని. గ్రంథచౌర్యం చేసాను. కానీ ఏ పరిస్థితుల్లో చేసానో తెలిస్తే...."

ఇంత సేపటికి ఆమె మొహం కప్పుకుని ఏడుస్తోంది.

"నా భర్తకి అనుకోని జబ్బు వరించింది. నాకు ముగ్గురు పిల్లలు. వెనకాల పెద్ద దక్షత లేదు మాకు. మాది ప్రేమ వివాహం. అంతటి ప్రేమమూర్తిని, నా కోసం సర్వం వదులుకున్న అ....ని చంపేసాను మాళవ్యగారూ! నా రక్తం పంచుకు పుట్టిన పిల్లల్ని కూడ..." అవురుమంది ఆమె.

నేను చదువుకున్న దానినే. నా భర్త ఉద్యోగం పోయింది అంతులేని జబ్బు వల్ల. నాకు పోస్టల్‌లోనే చిన్నఉద్యోగం. చాల తక్కువ జీతం. దానితో ఇంతమంది బ్రతకడం కష్టమై పోయింది. రోగిష్టి భర్త సాధింపులు- ఆ రోగం- భరించలేక- పిల్లల ఆకలి కేకలు- నన్ను పిచ్చిదాన్ని చేసాయి మాళవ్యగారూ! నాలో విచక్షణా జ్ఞానం నశించింది.

డబ్బుకోసం కొన్నాళ్ళు ఏ స్త్రీ చెయ్యకూడని పని.... నా శీలాన్ని... అదికూడ చేసాను. కాని ఏ మహానుభావుడో పుణ్యం కట్టుకుని నాకు సుఖరోగం అంటించాడు.

ఇటు నాకు మందులు- నా భర్తకి- పిల్లల ఆకలి.

ఆ సమయంలోనే బరువైన మీ కవర్లు చూసి నాకు...

అంతే తప్పని తెలిసికూడ... అవి విప్పి చదివి 'మృణాళ్' పేరుతో మీరే పత్రిక అడ్రసు వ్రాసారో దానికే పంపేదాన్ని. మీ ముగింపు నచ్చక చేతనైనంతలో మార్చి వ్రాసేదానిని. అసలు నేను చేస్తున్నా పని ఫలప్రదమవుతుందో లేదో, ఆ రచనలు అచ్చవుతాయోలేదో నాకు తెలియదు. కాని విచిత్రంగా నాలుగు కథలూ అచ్చయ్యాయి, నాకు డబ్బు అందింది. పత్రికవాళ్ళు పోటీ కథకి వివరాలు, ఫోటో పంపమన్నప్పుడు భయపడ్డాను దొరికిపోతానేమోనని. కాని మీకు తెలుసుగా....

ఆ డబ్బు మా ఆకలి తీర్చింది చాన్నాళ్ళు. మళ్లీ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసేదాన్ని మీ కథల కోసం.

మీ రియాక్షన్ తెలియదు కానీ మళ్ళీ కథలు అచ్చయ్యాయి.

కానీ మూడో సారి మీ వలలో చిక్కుకుపోయిందీ చేప.

నాకు మతి పోయింది. ముగింపు మార్చకుండా పంపిన కథలు... కాపీ కథలు.... మీ తెలివికి జోహార్లర్పించినా పత్రికాధిపతుల నుండి నాకందిన ఉత్తరాలు చూసి నా తల ఎక్కడ దాచుకోవాలో తెలియలేదు.

ఆ తరువాత మీరు నా మీద ప్రయోగం చేస్తున్నారనే భయంతోనూ, ఇక నా రచనలు స్వీకరించమన్న పత్రికల

వారి బెదిరింపులతోను మీ కథలు తాకనే లేదు.

అశ్రద్ధవల్ల నా చిన్న ఉద్యోగం కాస్తా ఊడింది. నా భర్త మందుల్లేక— అతని జీవితం రోజుల్లోకి వచ్చింది. ఆ రోగం... వద్దులెండి.

ఆకలి సిగ్గు అభిమానం చంపేస్తే ఆయన బంధువులని, నా వాళ్ళని చేయి సాచి అర్థించాను. ఫలితం శూన్యం.

పధ్నాలుగేళ్ళ నా కూతురుని... దానికి డబ్బులు లంచం పెట్టి దాని శీలం దోచుకున్నారని తెలిసి. ఆకలికి తాళ లేక అది చేసిన పనికి .

ఆ పిల్లలంతా నన్ను పీక్కుతినే రాక్షసుల్లా కనిపించారు.

నేను ఎలాగూ పతితనే. కానీ ఈ ముగ్గురాడపిల్లలూ కూడా.. వద్దు భగవాన్.... అందుకే మాళవ్యగారూ ఆ ఆవేశంలో మందుపెట్టి చంపేసాను అందర్నీ— నా భర్తతో సహా నేనూ చచ్చిపోదామనుకున్నాను. కానీ నా కంత సులభమైన మరణం రాకూడదని.. అదీ గాక ఆ స్థితిలో కూడా మిమ్మల్ని క్షమాపణ అడిగితే తప్ప .

పోలీసులొచ్చే వరకూ కూడా రాత్రంతా శవాల జాగరణ చేసాను.

ఆ తర్వాత కేసు పూర్తయింది త్వరలోనే. ఇప్పుడు చచ్చిపోతున్నానని నాకు బాధలేదు మాళవ్యగారూ! అంత దారుణంగా నా వాళ్ళను చంపిన నాకు ఒక్క క్షణంలో ప్రాణం తీసే ఈ శిక్ష చాలదు. చిత్రవధ చెయ్యాలి.

కానీ ఈ అభాగ్యురాలిదొక కోరిక— ఈ కథకు— నా కథకు— ముగింపు మార్చకుండా ఇదే కథ వ్రాయాలి మీరు.

మీ కథలన్నింటికీ ముగింపు మార్చేసాను నేను.

కానీ నా కథకు మాత్రం ముగింపు మార్చకండి."

మాళవ్యకు చేతులెత్తి నమస్కరించి అతను నిశ్చేష్టుడై చూస్తూండే నన్ను సమీపించింది ఆమె— మృణాళిని.

కానీ నే నీసారి వణకలేదు, ఆమె క్షోభకు ఎంత త్వరగా విముక్తి కలిగిద్దామా అని ఆత్రుత నాలో.

కానీ ఈ కథకు మాళవ్య ముగింపు మారిస్తే బాగుండుననిపించింది. కానీ ఇలాంటి కథలకీ ముగింపు మార్చాల్సిన బాధ్యత రచయిత దే.

